www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 24 జూన్ 2024
5
పశ్చిమ గోదావరి



సామాన్యులకు సబ్సిడీపై కూరగాయలు అందించాలి

సిపిఎం మండల కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పాలకొల్లు
కూరగాయల ధరలు కొండెక్కి సామాన్య ప్రజలకు అందుబాటులో లేవని సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి కూరగాయల ధర కిలో 100 రూపాయలకు దగ్గరగా ఉన్నాయన్నారు. ఉల్లి ధర వింటే ఉలిక్కిపడేలా వుందన్నారు. ప్రభుత్వం పేదలకు సబ్సిడీపై కాయగూరలను అందించాలన్నారు. కిరాణా, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న సందర్భంలో కూరగాయల ధరలు పెంపు మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని లేకపోతే సామాన్యుడి బతుకు మరింత భారమౌతుందని శ్రీనివాసరావు తెలియజేశారు.

కొత్త కలెక్టర్లకు.. సరికొత్త సవాళ్లు..!


కలెక్టర్ వెట్రి సెల్వి


కలెక్టర్ నాగరాణి

- ప్రభుత్వం మారడంతో రెండు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం
- ఏలూరుకు వెట్రి సెల్వి, 'పశ్చిమ'కు సి.నాగరాణి
- ఏలూరు జిల్లాలో పోలవరం, చింతలపూడి, కొల్లేరు వంటి ప్రజల సమస్యలెన్నో
- పశ్చిమలో తాగునీరు, కాలుష్యం, కౌలు రైతుల సమస్యలు అనేకం
- తమదైన ముద్రవేసే అధికారులుగా ముందుకు సాగేనా?
- నేడు, రేపో బాధ్యతలు తీసుకునే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
ప్రభుత్వం మారింది. అధికారుల మార్పిడి మొదలైంది. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లాకు వెట్రి సెల్వి, పశ్చిమకు సి.నాగరాణి జిల్లా కలెక్టర్లుగా నియమితులయ్యారు. ఒకటి, రెండు రోజుల్లో వీరు బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో జిల్లా ప్రజానీకం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలన్నీ కొత్త కలెక్టర్లు పట్టించుకోవాలని, తమదైన మార్క్ పాలన సాగిస్తారా అన్న చర్చ సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించిన తీరు పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రభుత్వంలోనైనా అధికారులు నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తారా అన్న చర్చ సాగుతోంది. ఏలూరు జిల్లాలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల సమస్య ప్రధానమైనదని చెప్పొచ్చు. ప్రాజెక్టు నిర్మాణంతో నిర్వాసితులకు పరిహారం ఇచ్చి తరలించకుండా కాఫర్ డ్యాం పూర్తిచేశారు. దీంతో ఏటా జులై, ఆగస్టు నెల్లో వచ్చే వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని దాదాపు వందకు పైగా గ్రామాలు నీటమునుగుతున్నాయి. అక్కడి ప్రజలు చెట్టుకొకరు, పుట్టకొకరు అన్నట్లు బతుకులు మారిపోతున్నాయి. దీంతో వరద బాధితులుగా మారిన నిర్వాసితులను ఆదుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. కొత్తగా బాధ్యతలు తీసుకున్న వెట్రి సెల్వి నిర్వాసితుల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సి ఉంది. వరదలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకుని అక్కడి ప్రజలను ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఉంటుంది. చింతలపూడి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరగడం లేదు. ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లి రైతులకు న్యాయం చేసే బాధ్యత తీసుకోవాలి. కొల్లేరులో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ చెరువుల తవ్వకాలను నిరోధించాలి. కొల్లేరు ప్రజలకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలి. ధ్వంసం చేసిన పట్టా భూములను తిరిగి కొల్లేరు బాధిత రైతులకు అప్పగించాలి. కొల్లేరును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రధాన పంటలు మొక్కజొన్న, ఆయిల్‌పామ్, వరి వంటి పంటలు పండించే రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. జిల్లాలో పాడైపోయిన రోడ్లను బాగుచేయాలి. ఆక్వాసాగుతో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలి. వ్యవసాయ ఆధారిత పంటలను నిర్దించే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రజలు ఎదుర్కొంటున్న ఇంకా అనేక సమస్యలు పరిష్కారం వంటివి కొత్త కలెక్టరు సవాలుగా మారనున్నాయి.

'పశ్చిమ'లో ప్రధాన సమస్యలు ఎన్నో

పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోనున్న సి.నాగరాణికి అనేక సమస్యల సవాళ్లు ముందున్నాయి. ఈ జిల్లాలో లక్షల సంఖ్యలో కౌలు రైతులు ఉన్నారు. వీరికి కౌలుకార్డుల జారీ, బ్యాంకు రుణాల అందజేత వంటివి సక్రమంగా జరగడం లేదు. వ్యవసాయ సాగులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నా న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. కౌలురైతులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. జిల్లాలో ఆక్వాసాగు ఎక్కువగా ఉంది. దీంతో ఆక్వా ఇతర పరిశ్రమల నుంచి కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. తాగునీటి వనరులన్నీ కలుషితమైపోయాయి. దీంతో జిల్లాలో కేన్సర్, కిడ్నీ రోగులు పెరుగుతున్న పరిస్థితి కొనసాగుతోంది. కాలుష్య నియంత్రణను అధికారులు పట్టించుకునేలా కలెక్టర్ పనిచేయాలని అంతా కోరుతున్నారు. ఆక్వా రైతులకు ధర విషయంలో అనేక సమస్యలు వస్తున్నాయి. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆక్వా రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. ఆక్వా యూనివర్సిటీ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంది. నరసాపురంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం వంటివాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. అస్తవ్యస్తంగా మారిన రోడ్లను బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లాలి. డెల్టా ఆధునికీకరణ పనులపై దృష్టిసారించి రైతులకు న్యాయం చేయాలి. ప్రజాసంఘాలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి జిల్లాలో సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుంది. బదిలీ అయిన జిల్లా కలెక్టర్ సుమిత్ గాంధీ కొద్దికాలం మాత్రమే పనిచేసినప్పటికీ ప్రజల ఆదరణ పొందడం విశేషం. కొత్తగా బాధ్యతలు తీసుకుంటున్న జిల్లా కలెక్టర్ సైతం తనదైన ముద్ర పాలనలో చూపించాలని అంతా కోరుతున్నారు.


న్యాయం చేయాలని మంత్రి నిమ్మలను కోరుతున్న డిఎస్‌సి 98 టీచర్లు

డిఎస్‌సి 98 టీచర్లకు న్యాయం చేయాలి

మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు
రాష్ట్రంలో డిఎస్‌సి 98 టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును పాలకొల్లులో కలిశారు. ఈ సందర్భంగా వారు ఆదివారం మంత్రికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 3500, జిల్లా వ్యాప్తంగా 200 మంది మినిమం టైం స్కేల్ కింద రెండేళ్ల నుంచి పని చేస్తున్నామని తెలిపారు. తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని, రిటైర్డ్ అయ్యాక కనీసం పింఛన్ ఇవ్వాలని, వయో పరిమితి 62కు పెంచాలని కోరారు. దూర ప్రాంతాల్లో పనిచేసే వారిని సొంత మండలాలకు గానీ, సమీప మండలాలకు గానీ వేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి రామానాయుడు సిఎం చంద్రబాబుతో మాట్లాడి డిఎస్‌సి 98 టీచర్లకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.సుబ్బారాయుడు అధ్యక్షత వహించారు.

పంట, మురుగు కాలువలను ఆధునికీకరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెంటపాడు
పంట, మురుగు కాలువలను ఆధునికీకరించాలని సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిపిఎం నేతలు సిరపరుపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు, కరక వెంకట్రావు తెలిపారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద రైతుల సమస్యలపై సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యలతో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో 2014 నుంచి సుమారు 10 సంవత్సరాల నుంచి అంతకు ముందున్న టిడిపి ప్రభుత్వం గానీ, తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం గానీ పంట కాలువలను, మురుగు కాలువలను ఎక్కడా ఆధునికీకరించలేదని తెలిపారు. దీంతో గుర్రపుడెక్క, తూడు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. జూన్ ఒకటో తేదీన పంట కాలవలకు నీటి విడుదల చేసినప్పటికీ శివారు భూములకు నీరు అందలేదని తెలిపారు. కొద్దిపాటి వర్షానికి అక్కడక్కడా పోసిన ఆకు మడుల్లో వర్షపు నీరు బయటకు వెళ్లక విత్తనాలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వెంటనే పంట, మురుగు కాలువల్లో పెరిగిపోయిన గుర్రపు డెక్క, తూడు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనుగంటి దుర్గ, అల్లు శ్రీను, సత్తినేడి బంగారయ్య, సత్తినేడి సత్యనారాయణ సిరపు గణేష్ పాల్గొన్నారు.

దోసపాడు భూములను అప్పగించండి

జెసి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలి - వ్యవసాయ కార్మిక సంఘం నేతలు


కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ కాపీలు చూపుతున్న వ్యకాస నేతలు రవి, రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
దోసపాడులో వాస్తవ అసైన్డ్‌దారులకు భూములు అప్పగించాలని జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ కాపీలను స్థానిక అన్నే భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో వ్యవసాయ కార్మిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 2016 నుంచి లోకయుక్తా ఇచ్చిన తీర్పు ఆధారంగా దోసపాడు పేదలు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఈ పోరాటాలు సుదీర్ఘ కాలం పాటు మూడు దశలుగా చేసినట్లు తెలిపారు. వివిధ రూపాల్లో సాగిన పోరాటంలో అధికారులు భూస్వాములిచ్చిన లంచాలు మింగి పేదలకు అన్యాయం చేయాలని చూశారని విమర్శించారు. అయినా పట్టు విడవని విక్రమార్కుల్లా దోసపాడు పేదలు, దళితులు వ్యవసాయ కార్మిక సంఘం అండతో పెద్ద ఎత్తున పోరాటాలు చేశారన్నారు. ఇదో గొప్ప విజయమని తెలిపారు. లోకయుక్తా తీర్పును ఎలాగైతే తప్పుదోవ పట్టించారో అలాగే రెవెన్యూ శాఖ అధికారులు ఇప్పుడు ఈ తీర్పును భూస్వాములు ఇచ్చే లంచాలు తిని అలాగే చేయాలని చూస్తున్నారని విమర్శించారు. అధికారులు, ప్రభుత్వం పేదల పక్షాన ఉండాల్సింది పోయి భూస్వాముల పక్షాన నిలబడడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్‌ను వెంటనే అమలు చేయాలని, అసలైన అసైన్డ్‌దారులకు పట్టాలు, పాస్ బుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమి చూపించి దానిపై వారికీ సర్వ హక్కులూ ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం పేదల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని, జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను రెవెన్యూ శాఖ అధికారులు అమలు చేసేలా ప్రభుత్వం పూనుకోవాలని కోరారు. ఇప్పటికే రెవెన్యూ శాఖ అధికారులు చేసిన తప్పిదాలకు ఎనిమిదేళ్ల నుంచి దోసపాడు పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎనిమిదేళ్ల నుంచి సాగు చేసుకున్న అవకాశం ఉన్న అవకాశాన్ని భూస్వాములకు అప్పజెప్పి రెవెన్యూ శాఖ అధికారులు చేతులు దులుపుకున్నారన్నారు. ప్రభుత్వం రెవెన్యూ శాఖ అధికారులు చిత్తశుద్ధితో ఆలోచించి ఎవరైతే అసలైన అసైన్డ్‌దారులు ఉన్నారో వారికి పట్టాలు, పాస్‌బుక్కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలం పోరాటాల ఫలితంగా దోసపాడు పేదలకు ఊరటనిచ్చే ఈ జడ్జిమెంట్ రేపు భూముల్లో సాగు చేసుకునే పంట వేసుకునే విధంగా రెవెన్యూ అధికారులు వ్యవహరించాలని కోరారు. దోసపాడు పేదలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడంతోపాటు గ్రామాల్లో 144, 145 సెక్షన్ పెట్టి పేదలను పోలీసులు నిద్రాహారాలు లేకుండా చేశారని విమర్శించారు. పేదలకు అనుకూలంగా ఇచ్చిన తీర్పులను అధికారులు వెంటనే అమలు చేయాలనీ, భూములు ఎక్కడున్నాయో గుర్తించి సంబంధిత అసైన్డ్‌దారులకు పట్టాలు, పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.ఆనందరావు, డి.నాగేంద్ర పాల్గొన్నారు.


పేరుపాలెం బీచ్ వద్ద పర్యాటల సందడి

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు
మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో ఉదయమే బీచ్‌కు చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

మండలంలో 87.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - నరసాపురం
జిల్లాలోని పలు మండలాలలో గడిచిన 24 గంటల్లో అత్యధికంగా పెంటపాడు మండలంలో 87.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెంలో 84.8, తణుకులో 52.4, ఇరగవరంలో 26.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని మొత్తం 20 మండలాలకు గాను 285.8 మిల్లీమీటర్ల వర్షం నమోదైందని అధికారులు తెలిపారు. జిల్లా యావరేజ్ వర్షపాతం 14.3 మిల్లీమీటర్లు నమోదైంది.

అల్లూరి పోరాట పటిమ ఆదర్శనీయం


ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు
జులై 4వ తేదీన అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా ఏలూరు పరిసరాల్లో 127 చోట్ల, 127 సంఘాలు, సంస్థలు కలిపి సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో వివిధ సంఘాలు, సంస్థల ప్రతినిధుల సమావేశానికి ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు ఆహ్వానం పలికారు. ఈ సమావేశానికి మానవత పూర్వజిల్లా అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మరణించి 100 సంవత్సరాలు పైబడినా ఆయన జీవిత పోరాట పటిమ ఆదర్శప్రాయం అన్నారు. విద్యార్థులు, ప్రజల్లో దేశభక్తిని పెంపొందించే ప్రయత్నం చేద్దామన్నారు. గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవితం గురించి లఘు నాటికలు, ప్రదర్శన వీడియోలను ఎవరైనా 30వ తేదీ సాయంత్రం వరకూ పి.రవికిషోర్ 98482 15477 లేదా పవన్ 6303713878, డి.గణేష్ 93945 51636లో ఏదో ఒక వాట్సాప్ నంబర్‌కు పంపించాలన్నారు. 4వ తేదీన సాయంత్రం ఏలూరు కోటదిబ్బలో ఉన్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ సీతారామ భర్తియా కళ్యాణ మండపంలో జరిపే సభలో బహుమతులు ఇవ్వడానికి తీర్మానించినట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి జులై 3వ తేదీ వరకూ స్కూళ్లు, కాలేజీల్లో స్థానికంగా అల్లూరి సీతారామరాజు జీవితం, పోరాటం సంఘటనలపై డ్రాయింగ్ పోటీలు, ఏకపాత్రాభినయం, వేషధారణ పోటీలు ఆయా విద్యాలయాల వారు నిర్వహించాలని పిలుపునిచ్చారు. బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బోఫ్) జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జులై 3వ తేదీన, 4వ తేదీన మొత్తం 127కుపైగా విద్యాలయాల్లో అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పూలమాల వేసి వేలది మందితో సభలు సమావేశాలు జరపాలన్నారు. ఆయా సభలకు 127 సంఘాలకు చెందిన ప్రతినిధులు అతిథులుగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సభలో వివిధ సంస్థలు, సంఘాలకు చెందిన విజిఎంవిఆర్.కృష్ణారావు, దువ్వి రామారావు, పి.సురేష్, ఎస్.కస్తూరి రావు, పెరియార్, ఎస్ఎన్.కట్టా, పి.రవీంద్ర, కె.లెనిన్, పి.దుర్గా ప్రసాద్ మాట్లాడారు. అనంతరం ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరించారు.

వీర సీతారామరాజు ట్రస్ట్ సేవలు అభినందనీయం

నరసాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ


ప్రోత్సాహం అందుకున్న విద్యార్థులతో ట్రస్ట్ సభ్యులు

ప్రజాశక్తి - మొగల్తూరు
పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు వీర సీతారామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని నరసాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ అన్నారు. ఆదివారం సాయంత్రం మొగల్తూరులోని అభ్యాస కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2023 - 24లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన భీమవరం, మొగల్తూరు, నరసాపురం గ్రామీణ మండలాలకు చెందిన అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గ బాలికలకు 30 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున ఆర్థిక సహకారం, షీల్డ్ అందించారు. ఇటీవల ఐఐటీలో ప్రవేశం సాధించిన కొల్లాటి దేవిచంద్రికకు రూ.5 వేలు ఆర్థిక సహాయం, ట్రిపుల్ ఐటీ చదువుతున్న విద్యార్థిని పొన్నమండ నవ్యశ్రీకి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించి వారిని ఘనంగా సత్కరించారు. ఈ విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని వెంకటరమణ సూచించారు. పేద కుటుంబాలకు చెందిన చదువుపై ఆసక్తి ఉన్న పదిమంది విద్యార్థినులను దత్తత తీసుకుని వారిని చదివిస్తామని ఆ సమస్త ఛైర్మన్ బర్రె కృష్ణమోహన్ హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాబూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ఆ సమస్త వైస్ ఛైర్మన్ బర్రె సీతారామరాజు, రేవు రాంబాబు, ఉపాధ్యాయుల దొంగ చింతయ్య, కటికల సూర్యారావు, నేదునూరి శ్రీనివాస్, ఆమదాలపల్లి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సహకార బ్యాంక్ ఖాతాదారులకు న్యాయం జరిగేనా?

దోచుకున్న సొమ్ము లెక్క తేలేనా..!

ఉండి: టిడిపి ప్రభుత్వంలోనైనా సహకార బ్యాంకు ఖాతాదారులకు సరైన న్యాయం జరుగుతుందా అని బ్యాంకు ఖాతాదారులు ఎదురుచూస్తున్నారు. సుమారు 7 వేల మంది ఖాతాదారులు ఉన్న ఉండి విశాల పరపతి సహకార సంఘంలో ఇంటి దొంగలే బ్యాంకును దోచుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో గత ఛైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణ రాజు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ అధికారిని గత అక్టోబర్ నెలలో నియమించిన విషయం తెలిసిందే. గత ఎనిమిది నెలల నుంచి సామాన్య ఖాతాదారునికి నగదు లావాదేవీలు నిలిచిపోయాయని, దీంతో ఖాతాదారులు తమ ఖాతాలోని నగదును తీసుకోవడానికి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8 నెలల కాలం గడిచినప్పటికీ విచారణ అధికారి పూర్తిస్థాయిలో విచారణ చేయకపోవడంతో ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8 నెలల కాలంలో విచారణ అధికారి పూర్తిస్థాయిలో విచారణ జరపకుండా మీన మేషాలు లెక్కిస్తున్నారని ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎనిమిది నెలల కాలంలో ఇప్పటివరకు జరిగిన విచారణలో ఇంటి దొంగలు దోచుకున్న నగదు సుమారు రూ.కోటి 50 లక్షల వరకు విచారణలో తేలినట్లు సమాచారం. దీనికి తోడు వైసిపి ప్రభుత్వం స్థానంలో కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టడంతో గత ఛైర్మన్ సూర్యనారాయణ రాజు తన పదవికి రాజీనామా చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీంతో ఖాతాదారులు తమ డబ్బులు ఏమైపోతాయోనని గందరగోళ పరిస్థితుల్లో అయోమయంలోకి వెళ్లిపోయారు. నేటి ప్రభుత్వం విచారణ వేగవంతం చేయించి ఖాతాదారులకు తగు న్యాయం జరిపించాలని ఖాతాదారులు కోరుతున్నారు.


సిపిఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేస్తా

ఎంఎల్ఎ ధర్మరాజు హామీ



ధర్మరాజుతో మాట్లాడుతున్న కార్మికులు

ప్రజాశక్తి - గణపవరం
మూసివేసిన సిఆర్ఎఫ్ ఫ్యాక్టరీని తెరిపించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు ఎంఎల్ఎ ధర్మరాజును కోరారు. ఆదివారం వారు ఉంగుటూరు మండలం నారాయణపురంలోని క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు పచ్చమట్ల ధర్మరాజును కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఫ్యాక్టరీ యాజమాన్యం తమను అన్యాయంగా తొలగించడం వల్ల ఇబ్బంది పడుతున్నామన్నారు. న్యాయం చేయాలని కోరారు. స్పందించిన శాసనసభ్యులు ధర్మరాజు మాట్లాడుతూ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పర్మినెంట్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలను కలిసిన నేతలు


మంత్రి నిమ్మలను అభినందిస్తున్న పెన్షనర్ సంఘం సభ్యులు

ప్రజాశక్తి - పాలకొల్లు
రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును ఆదివారం పాలకొల్లులోని ఆయన కార్యాలయంలో వివిధ రంగాల ప్రజలు కలిసి అభినందనలు తెలియజేశారు. మాజీ ఎంఎల్ఎ బంగారు ఉషారాణి మంత్రికి శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. పాలకొల్లు చాంబర్ కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు, గోదావరి జిల్లాల మున్సిపల్ ఆర్‌జెడిసిహెచ్ నాగ నరసింహారావు, నరసాపురం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పెన్షనర్ సంఘం సభ్యులు వంగా నరసింహారావు అధ్యక్షతన కలిసి అభినందనలు తెలిపారు. ఫైనాన్స్ సంఘ సభ్యులు మంత్రిని అభినందించారు. నియోజకవర్గంలోని ప్రజలు, వివిధ నియోజకవర్గాల నేతలు కూడా మంత్రికి బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



వల్లూరులోని ఉచిత మెడికల్ క్యాంపులో వైద్య సిబ్బంది

మెడికల్ క్యాంప్‌లో 182 మందికి పరీక్షలు

ప్రజాశక్తి - ఆచంట

పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని వల్లూరు సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్ రావు అన్నారు. పాలకొల్లు టౌన్ హాస్పిటల్, మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో వల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ క్యాంపును వల్లూరు సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్ రావు ప్రారంభించారు. ఈ మెడికల్ క్యాంపుకు ఎండి జనరల్ డాక్టర్ కార్తీక్ మురుగుతి, యూరాలజిస్ట్ డాక్టర్ విజయదుర్గ ప్రసాద్, ఎండి డాక్టర్ శ్రీలక్ష్మీ ప్రసన్న బయ్యా, ఎంఎస్ ఆర్థోపెడిక్ డాక్టర్ శ్రీహర్ష నారినలు 182 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



వల్లూరులో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

యాదవుల అభివృద్ధికి సంఘాల విస్తరణ

రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర


రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న యాదవ ప్రజానికాన్ని ఏకం చేసి, అభివృద్ధి పరచడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘాన్ని విస్తరణ చేస్తున్నామని రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షులు కొర్ర శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. ఆదివారం ఈమేరకు వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో, అన్ని మండలాల్లో యాదవులు ఉన్నారని పేర్కొన్నారు. వారందరికీ సరైన నాయకత్వం లేక కేవలం కొన్ని చోట్ల మాత్రమే అన్ని రంగాల్లో ముందుండి, మిగిలిన చోట్ల వెనకబడిపోయారని తెలిపారు. ప్రతి జిల్లాలోను, ప్రతీ నియోజకవర్గంలోను యాదవ సంఘాలను విస్తరింప చేయటమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, త్వరలో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని కొర్ర యాదవ్ స్పష్టం చేశారు.

జిఒ 117ను రద్దు చేయాలి

ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రకాశం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన 117 జిఒను తక్షణమే రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం అన్నారు. ఆదివారం భీమవరంలో జరిగిన జిల్లా సబ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ విద్యా సంస్థల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. జిఒ నెంబర్ 117 రద్దు చేయాలని, అలాగే జూలై 1, 2023 నుంచి పిఆర్‌సి అమలు చేయాలి, పిఆర్‌సి అమలు ఆలస్యం అవుతున్నందున, వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని ఆయన అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బివి.నారాయణ మాట్లాడుతూ హై స్కూల్స్‌లో ఇంగ్లీష్ మీడియంతో పాటు, తెలుగు మీడియం కూడా అమలు చేయాలని అన్నారు. అమ్మకు వందనం పథకం కేవలం ప్రభుత్వ పాఠశాలలకు వర్తింప చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, రాష్ట్ర కౌన్సిలర్ జి.పార్వతీదేవి, జిల్లా కార్యదర్శి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు కుమార్, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మంత్రికి మొక్కను అందజేస్తున్న రెడ్డి అప్పలనాయుడు

మంత్రి నిమ్మలను కలిసిన అప్పలనాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి, పాలకొల్లు నియోజకవర్గ ఎంఎల్ఎ డాక్టర్ నిమ్మల రామానాయుడుని ఆదివారం పాలకొల్లులోని వారి కార్యాలయంలో జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, మీడియా ఇన్‌ఛార్జి జనసేన రవి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బైక్ చోరీపై కేసు

ప్రజాశక్తి - ఉండి

బైక్ చోరీపై కేసు నమోదైన సంఘటన ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన అడ్డాల అనిల్ ఈనెల 11వ తేదీన వడ్రంగి పని నిమిత్తం ఉండి వెళ్తూ మార్గమధ్యంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలో ఉన్న రామచంద్ర డైరీ పార్లర్ వద్ద బండి నిలుపుదల చేసి టీ తాగడానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బండి అదృశ్యమైందని ఆదివారం అడ్డాల అనిల్ ఉండి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫ్లెక్సీ వివాదంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండలం పెద్దపుల్లేరు గ్రామానికి చెందిన పాటూరి మోహన్ అనే వ్యక్తి జనవరి 21వ తేదీన అయోధ్య శ్రీరామ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా పెదపుల్లేరు రామాలయం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. దీంతో అదే గ్రామానికి చెందిన గేదెల నరసింహులు అనే వ్యక్తి మోహన్‌ను అవహేళన చేస్తూ మాట్లాడాడని, నాటి నుంచి ఫోన్ చేసి దుర్భాషలాడుతూ వాట్సాప్‌లో తన తల్లి గురించి అసభ్యంగా మాట్లాడుతూ మానసికంగా హింసిస్తున్నాడని ఆదివారం పాటూరి మోహన్ గేదెల నరసింహులుపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేశవరం వంతెన నిర్మించేదెప్పుడు..?

12 ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రజల కష్టాలు తీరేదెప్పుడు..!

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని ఉండి కాలువపైన బ్రిటిష్ కాలంలో నిర్మించిన కేశవరం వంతెన 2012లో కూలిపోయింది. వంతెన కూలిపోవడంతో కేశవరం, అప్పన్నపేట, జల్లి కాకినాడ, మల్లప్ప రాజుపేట గ్రామానికి సంబంధించిన ప్రజలు తమ రాకపోకలకు ఇబ్బందులేర్పడ్డాయి. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అప్పటి కాంగ్రెస్ మంత్రిగా ఉన్న వట్టి వసంత కుమార్ తాత్కాలికంగా బెయిలి వంతెన ఏర్పాటు చేశారు. అయితే ఆనాటి నుంచి ఈనాటి వరకు ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో ఇనప వంతెనపై నుంచి రైతులు తమ పొలాలకు, విద్యార్థులు హై స్కూలు, పాఠశాలలకు, ప్రజలు తమ రాకపోకలు కొనసాగిస్తున్నారు. వంతెన కూలిపోయి 12 ఏళ్లు దాటినా ప్రభుత్వం వంతెన నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఇనుప వంతెన శిథిలావస్థకు చేరి వంతెన ఫ్లాట్ ఫారం రంధ్రాలు పడడంతో వాహనదారులు రంధ్రాల్లో పడి గాయాల బారిన పడేవారు. ఆ సమయంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళన నిర్వహించడం, కేశవరం సర్పంచి మిడతానే కామేశ్వరి నాగేశ్వరరావు మండల పరిషత్ సమావేశాల్లో వంతెన విషయం అధికారుల దృష్టికి తీసుకురావడంతో వంతెనకు 2022లో రూ.7 లక్షలతో మరమ్మత్తులు నిర్వహించారు. దీంతో ప్రజలకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ రాకపోకలు కొనసాగిస్తున్నారు. వంతెన నిర్మాణం చేయాలని గ్రామ సర్పంచి భర్త మిడతా నాగేశ్వరరావు అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డికి భీమవరం సభలో వినతి పత్రం అందించి వంతెన



శిథిలావస్థకు చేరిన బెయిలి వంతెన

నిర్మాణం చేయాలని కోరారు. అయినప్పటికీ ఇప్పటివరకు వంతెన నిర్మాణం చేయడానికి అధికారులు, ప్రభుత్వం ముందుకు రాకపోవడం అన్యాయమని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణం చేస్తే నాలుగు గ్రామాల ప్రజలకే కాకుండా తణుకు నుంచి భీమవరం వెళ్లే వారికి, ఇటు భీమవరం నుంచి తాడేపల్లిగూడెం, తణుకు వెళ్లే వారికి వంతెన దగ్గర దారిగా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా జల్లి కాకినాడ, అప్పన్నపేట, మల్లపురాజుపేట గ్రామానికి చెందిన రైతులకి కేశవరం ప్రాంతంలో ఉన్న పొలాలకు వెళ్లడానికి వీలుగా ఉంటుంది. అదేవిధంగా ఈ నాలుగు గ్రామాలకు సంబంధించి హై స్కూలు, పాఠశాలలు కేశవరంలో ఉండడం వల్ల విద్యార్థులు తమ చదువు నిమిత్తం కేశవరం వెళ్లడానికి వంతెన ఉపయోగపడుతుందని స్థానికులు చెబుతున్నారు. కొత్తగా రాష్ట్రంలో ఏర్పడ్డ టిడిపి కూటమి ప్రభుత్వం 12 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న వంతెన నిర్మాణం చేపడుతుందని స్థానిక ప్రజలు తమ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బెయిలి వంతెన మరలా శిథిలావస్థకు చేరకముందే కేశవరం వంతెన నిర్మాణం చేయాలని కేశవరం ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



2022లో బెయిలి వంతెనకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచి(ఫైల్ ఫోటో)


హాస్టల్ విద్యార్థులతో 'బడికి పోదాం రా' ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వెనుకబడిన తరగతుల వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపితే ప్రభుత్వం పుస్తకాలు, దుస్తులు ఉచితంగా అందిస్తున్నారని విద్య, హాస్టల్స్ పర్యవేక్షకులు, పాఠశాలల పరిశుభ్రత కో ఆర్డినేటర్ కెవి.కృష్ణారావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో 'బడికి పోదాం రా' కార్యక్రమాన్ని వెనుకబడిన తరగతుల బాలికల హాస్టల్ విద్యార్థులతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ భానుమణి మాట్లాడుతూ గత 14వ తేదీ నుంచి చాలామంది బాలికలు హాస్టల్‌లో చేరుతున్నారని, స్వచ్ఛంద సంస్థలు కూడా అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 'బడికి పోదాం రా' కార్యక్రమాన్ని ప్రభుత్వంతో పాటు అవగాహన కార్యక్రమాలను స్వచ్ఛంద సంస్థలు, తాము కూడా ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యలేక పోతే ఆధునిక యుగంలో భవితవ్యం శూన్యమని తెలిపారు. లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ బాలికల విద్యపై వివరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

ప్రకాశం పంతులు విగ్రహ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్




అంజిబాబుకు వినతినిస్తున్న విగ్రహ కమిటీ నాయకులు

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో భీమవరం ప్రకాశం చౌక్‌లో ప్రకాశం పంతులు విగ్రహాన్ని నెలకొల్పడానికి అనుమతులు కోరుతూ భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులకు వారి కార్యాలయంలో వినతి పత్రాన్ని ఆదివారం అందించారు. ప్రకాశం పంతులు విగ్రహ నిర్మాణ కమిటీ కార్యదర్శి చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 90 ఏండ్ల నాటి స్వాతంత్రోద్యమంలో ప్రకాశం పంతులు భీమవరం గ్రామానికి వచ్చినప్పుడు ఆయనతో జెండా ఎగుర వేసిన ప్రాంతంలో ప్రకాశం చౌక్ అని నామకరణం చేశారని, ఇప్పటి వరకు విగ్రహం లేని ప్రకాశం చౌక్ ఉందని, 15 ఏళ్లుగా ప్రజా ప్రతినిధులకు ఈ విషయంపై చర్చిస్తూ వస్తున్నామన్నారు. ఈసారి ఎంఎల్ఎ అంజిబాబు తప్పక విగ్రహ ఆవిష్కరణకు స్థలం అనుమతి మంజూరు చేస్తారని భావిస్తున్నామని తెలిపారు. దీనిపై ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం మంచి అభివృద్ధి చేస్తుందని, తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు విగ్రహం ప్రకాశం చౌక్‌లో ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని అన్నారు. విగ్రహ కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, నందమూరి రాజేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవి.రమణ, ఉండపల్లి రమేష్ నాయుడు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, ఎద్దు ఏసుపాదం, ఇందుకూరి శివాజీ వర్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన 11 హైస్కూల్‌లకు చెందిన 33 మంది విద్యార్థులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ డాక్టర్ ముత్యాల సంజయ్, పి.రామ్మోహన్ రావు, ఆర్.అప్పారావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విద్యా విధానానికి ఎన్నో మార్పులు రానున్నాయన్నారు. పోటీతత్వం పెరిగిందని, దానికి అనుకూలంగా నేటి విద్యార్థులు చదువులో పోటీపడి నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదవాలని అప్పుడే పోటీతత్వం అలవడుతుందని, మొబైల్ ఫోన్లకు బానిసలు కాకూడదని ఎంపిపి వీరవల్లి దుర్గా భవాని అన్నారు. వీరవాసరం యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో 150 కుట్టు మిషన్ల పంపిణీ జరిగిందని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి కాపు క్లబ్ ముందుకు వస్తుందని, క్లబ్ ఇచ్చే శిక్షణా కార్యక్రమాలలో 30 శాతం బిసిలకు, ఎస్‌సిలకు, మైనార్టీలకు కూడా అవకాశం ఉంటుందని గుండా రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరవాసరం మండలం వైస్ ఎంపిపి అడ్డాల రాము, టిడిపి మండల అధ్యక్షులు కొల్లేపర శ్రీనివాస రావు, వీరవల్లి చంద్రశేఖర్, వడ్డి సుబ్బారావు, గ్రంధి కిషోర్, జవ్వాది శ్రీనివాస్, ఎం.శ్రీమన్నారాయణ, మండల విద్యాశాఖ అధికారి, వీరవాసరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయకుదురు ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస్, ఎంఆర్ కె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్, శనివారపుప్రసాద్, యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సిహెచ్.ఫణి కుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన రాయకుదురు పాఠశాలకు చెందిన జక్కంశెట్టి రిబక డివిజన్ స్థాయిలోనే ప్రథమ స్థానాన్ని సాధించడం వీరవాసరం మండలానికి గర్వకారణం అని గుండా రామకృష్ణ అన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

భవిష్యత్ పరిశోధనలకు మంత్రి, ఎంఎల్ఎ దిశా నిర్దేశం

మార్టేరు ఫామ్ ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్



మంత్రి నిమ్మలను కలిసిన శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని మార్టేరు వ్యవసాయ పరిశోధనాస్థానంలోని భవిష్యత్ పరిశోధనలకు రాష్ట్రమంత్రి, మాజీ మంత్రి, ఎంఎల్ఎలు దిశానిర్దేశం చేశారని పరిశోధనా స్థానం కొత్త ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ వెల్లడించారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును, మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణను గౌరవ పూర్వకంగా కలిసినట్టు తెలిపారు. 100 సంవత్సరాల పరిశోధనా ప్రగతిని గురించి వివరించానన్నారు. ఈ సందర్భంగా మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి 2022వ సంవత్సరంలో విడుదల చేసిన



ఎంఎల్ఎ పితానితో శ్రీనివాస్

రైతుల మన్ననలు పొంది పడిపోని స్వర్ణగా పేరుగాంచిన ఎంటియు 1318 రకాన్ని అందించి వాటి గుణగణాలను గురించి వివరించానన్నారు. ఈ సందర్భంగా సహపరిశోధనా సంచాలకుల ప్రభుత్వం అండదండలు పరిశోధనా స్థానానికి మెండుగా ఉండాలని కోరారు. ఈ నేపథ్యంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల, ఎంఎల్ఎ పితాని రాబోయే కాలానికి పరిశోధనలో దిశానిర్దేశం చేసి, మంచి సలహాలు, సూచనలు ఇచ్చారని ఎడిఆర్ పేర్కొన్నారు.

జగనన్న కాలనీల్లో వసతులు కల్పించని వారిపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం మండల కమిటీ విజ్ఞప్తి

ప్రజాశక్తి - వీరవాసరం

జగనన్న కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా గాలికి వదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత అధికారులు, ఆయా గ్రామల సర్పంచులపై నూతన ప్రభుత్వం చట్టపరమైన తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం వీరవాసరం మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఆదివారం నౌడూరు జంక్షన్‌లో సిపిఎం కార్యకర్తల విస్తృత సమావేశం అయినపూడి బాబురావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు జుత్తిగా నరసింహమూర్తి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన జగనన్న కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి సౌకర్యాలు లేక కొద్దిపాటి వర్షాలు వస్తే కాలనీలన్నీ మునిగి పోయి కంపు కొడుతున్నాయన్నారు. పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి పోవడం వల్ల విష సర్పాలు సంచరిస్తున్నాయన్నారు. మత్స్యపూరి పాలెం, ఉత్తర పాలెం, తలతాడితిప్పా కాలనీలో అధికారులు తక్షణం పర్యటించాలని అన్నారు. కాలనీలు అపరిశుభ్రంగా ఉండడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారని అన్నారు. అండలూరు, మడుగు, పోలవరం గ్రామాల కాలనీలలో సంబంధిత అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు పర్యటించాలని విజ్ఞప్తి చేశారు. వీరవాసరం, పెరికిపాలెం గ్రామాల్లో డ్రెయినేజీలు, కచ్చా డ్రెన్ల మరమ్మత్తులు చేయకపోవడం పారిశుధ్యం సరిగ్గా లేక పెంట కుప్పలు రోడ్లు పైనే వేయడం వల్ల అంతర్గత రోడ్లు పాడైపోవడం వల్ల దోమలు, ఈగలు, విష సర్పాలు సంచరిస్తున్న అధికారులు, సర్పంచులు పట్టించుకోరా అంటున్నారు. గత సంవత్సరం ఇదే రోజుల్లో పెరికిపాలెంలో డెంగీ, టైఫాయిడ్, మలేరియా లాంటి వ్యాధుల వల్ల చనిపోయిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. మంచినీరు కలుషితమయ్యి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, ఆరోగ్య డిపార్ట్మెంట్ వారు యుద్ధ ప్రాతిపదికన గ్రామాల్లో పర్యటించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండల కార్యదర్శి పోతుల మృత్యుంజయ భవిష్యత్తు కర్తవ్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో యాల్ల బండి నారాయణమూర్తి, జుత్తుగా శ్రీనివాస్, లింగం సత్యనారాయణ, తాళ్లూరు రాము, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, గొట్టుముక్కల శ్యాంబాబు, కుడిపూడి పెద్దిరాజు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి నిమ్మల భరోసా

సిఎం సహాయ నిధి నుంచి సాయం అందజేసేలా చర్యలు

ప్రజాశక్తి - పాలకొల్లు

కిడ్నీ సమస్యతో బాధపడుతున్న 13 నెలల చిన్నారిని చూసి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చలించారు. బాలిక వైద్య సహాయానికి తక్షణం సిఎం సహాయ నిధి నుంచి సహాయం అందించాలని మాట్లాడారు. పాలకొల్లు 18వ వార్డుకు చెందిన చిన్నారి అక్షరను వెంటబెట్టుకుని ఆమె తల్లిదండ్రులు ఆదివారం మంత్రిని కలిశారు. చిన్నారికి 3 నెలల క్రితం కిడ్నీ సమస్య రాగా తొలగించారని, ప్రస్తుతం మరొక కిడ్నీ సమస్యతో యూరినల్ పైపు సన్నబడి ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. అమరావతి మణిపాల్ ఆసుపత్రిలో చూపించగా శస్త్ర చికిత్స అవసరం అవుతుందని, రూ.లక్షా 50 వేలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారన్నారు. తాము పేద కుటుంబం వల్ల ఇంత సొమ్మును భరించలేమని, పాపకు వైద్య సహాయం అందించాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి తక్షణం స్పందించి సిఎం సహాయనిధి అందేలా సిఎం కార్యాలయానికి ఫోన్ చేసి మాట్లాడారు. చిన్నారి పరిస్థితిని వివరించి పది రోజుల్లో శస్త్ర చికిత్స చేయాల్సి ఉన్నందున సహాయం అందేలా చూడాలని కోరారు. చిన్నారి తల్లిదండ్రులకు అధైర్యపడవద్దని, మీ పాప క్షేమంగా ఉండేలా నేనున్నానంటూ మంత్రి రామానాయుడు ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. తమ పాప పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే స్పందించిన మంత్రికి పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్న నిమ్మల

జూన్ మొదటి వారంలో ధాన్యం బకాయిలు చెల్లింపు

ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు డబ్బు చెల్లించేందుకు రూ.3200 కోట్లు రుణాలు తీసుకుని వేరే ఖాతాలకు మళ్లించిందని, దీంతో రైతాంగానికి రెండు నెలలు కావస్తున్న ధాన్యం సొమ్ము జమ కాలేని పరిస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం విలేకరులతో ఆయన స్వగృహంలో మాట్లాడారు. ఈనాడు రాష్ట్రంలో రైతుల తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో ఉన్న మాట వాస్తవం అని, ధాన్యం సేకరించి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వం చెల్లించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సివిల్ సప్లై మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లాలని చెప్పారు. జూలై మొదటి వారంలో నుంచి దఫదఫాలుగా రైతుల ఖాతాలో ధాన్యం బకాయి సొమ్మును జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులను ఆదుకునేందుకు రూ.16 వేల కోట్ల ధాన్యం బకాయిలు 15 రోజుల లోపల చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులకు ఆర్థిక ఇబ్బందులు నివారించేందుకు ధాన్యం బకాయిల త్వరలోనే చెల్లిస్తామని పితాని సత్యనారాయణ చెప్పారు.

సాగునీటి ఎద్దడి నివారేస్తాం.

నారుమళ్లు వేసేందుకు రైతాంగం సిద్ధం కండి

పశ్చిమగోదావరి జిల్లాలో నీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి సిఎం చంద్రబాబు నాయుడుతో చర్చించామని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ రైతులకు భరోసా ఇచ్చారు. గోదావరిలో నీటి లభ్యత తక్కువ ఉన్న కారణంగా నీటి ఎద్దడి ఉత్పన్నమైందని, దానిని నివారించేందుకు గోదావరి ఎడమ కాల్వా నుంచి నీటి ప్రవాహాన్ని తగ్గించి గోదావరి కుడికాలువకు నీటి లభ్యత పెంచి నరసాపురం బ్యాంక్ కెనాల్‌కు నీటి లభ్యత పెంచుతామని అధికారులు చెప్పినట్లు వెల్లడించారు. దీంతో రైతాంగం నారుమళ్లకు సిద్ధం కావాలని, కాలాతీతం కాకుండా నారుమడులు సకాలంలో వేసుకుని నాట్లు ప్రారంభించాలని సూచించారు. మార్టేరు వరి పరిశోధన స్థానం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్‌తో చర్చించారు. సార్వ పంటకు రైతులకు అవసరమైన సూచనలు సలహాలు ఎప్పటికప్పుడు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పితాని ఆదేశించారు.

దేవాంగ సత్రం బోర్డు మెంబర్‌గా గణేష్

ప్రజాశక్తి - పాలకొల్లు

శ్రీశైలంలో శ్రీఉమా రామలింగేశ్వర దేవాంగ సత్రంలో శనివారం జరిగిన కమిటీ మీటింగ్‌లో సత్రం బోర్డు మెంబర్‌గా పాలకొల్లుకు చెందిన వట్టం గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాలకొల్లు దేవాంగ సంఘ పెద్దలు స్థానిక వీవర్స్ కాలనీలోని వీవర్స్ కళ్యాణ్ మండపంలో గణేష్ దంపతులను ఘనంగా సత్కరించారు. సంఘ సభ్యులు మానెం బసవరాజు, ఊటుకూరి భోగేశ్వరరావు, బాసిన సత్యనారాయణ, కుర్మా శివగణేష్, బాసిన గుణ్ణేశ్వరరావు, యర్రా శివాజీ, బొండపల్లి చంద్రశేఖర్, నక్కిన విజయలక్ష్మి, రొబ్బి భాస్కరరావు, అల్లాడ కుమారస్వామి తదితరులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం కిటకిట

మొగల్తూరు:మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ధ్యానం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం

ధ్యాన శిక్షకులు బండి శ్రీనివాసరాజు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ధ్యానం చేయడం వల్ల మనుషులకు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యం కలుగుతుందని సీనియర్ పిరమిడ్ ధ్యాన శిక్షకులు బండి శ్రీనివాసరాజు(హైదరాబాద్) అన్నారు. ఆదివారం పెనుమంట్రలోని భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, సాయిగీతలచే నిర్మించిన జగద్గురు డాక్టర్ బ్రహ్మర్షి పితామహ పత్రీజీ పిరమిడ్ ధ్యానమందిరం వద్ద పిరమిడ్ ధ్యానశిక్షణా కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ధ్యానం అనేది మానవుడిని మాధవుడుగా తయారు చేస్తుందని, ధ్యానం చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, పరస్పర అవగాహనతో పాటు ఇంగిత జ్ఞానం పెంపొందుతాయన్నారు. శాకాహారం తినడం వల్ల కలిగే లాభాలు తెలిపారు. గంటసేపు అందరితో సామూహిక ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా పిరమిడ్ సంస్థ అధ్యక్షుడు మేకా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిఎంసిలో జూలై నెలలో నిర్వహించే పత్రీజీ రెండవ ఆరాధనోత్సవాలలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ ప్రతినిధులు మధు, రామకృష్ణ పాల్గొన్నారు.